

నవాబుల నగరంగా పేరున్న లక్నో గాలి సోకగానే కవిత్వం ముంచుకొస్తుంది. పాట పొంగుకొస్తుంది. నాట్యం వెల్లివిరిస్తుంది. దక్కనీ షాన్ హైదరాబాద్‌కు ఉత్తరాది ప్రతిబింబంలా దర్శనమిస్తుంది లక్నో! ఆహార్యంలోనే కాదు.. ఆహార విషయాల్లోనూ రెండూ మెండైనవే! ఇక్కడ నైజాం వంటకాల ఘాటు పోటు మీదుంటే.. అక్కడ మొఘలాయి మసాలాలు నశాలానికి అంటుతాయి. ఎందుకు ఆలస్యం అవధ్ ఇలాఖాలోని లక్నోలో అవధుల్లేని రుచులు ఆస్వాదిద్దాం పదండి..

# నవాబ్స్ నగరి కబాబ్స్ శాయరీ

లక్నో వీధుల్లో తిరుగుతుంటే... 'ఆజ్ జానే కీ జిద్ నా కరో' అని ఈ నగరానికే చెందిన బేమిసాల్ గాయని బేగం అక్తర్ గజల్ లీలగా వినిపిస్తుంది. 'ఈ రోజే వెళ్తానని మారాం చేయకు' అని ఆ పంక్తి భావం. ఘనమైన పాకశాలగా పరిఢవిల్లుతున్న ఈ నవాబుల శహర్‌కు రావడంతోనే ఘనమైన రుచులు ఆస్వాదించడంలో మునిగిపోతారంతా! జఠరాగ్ని కొడి గట్టినవాళ్లు మాత్రం ఈ పూటే వెళ్లిపోతామని మారాం చేస్తారు. కానీ, నిహారీ కుల్చా వాసన ముక్కుకు సోకగానే.. రెండు హాజ్‌మోలా బిళ్లలు వేసుకొని మరీ ప్రయాణం వాయిదా వేసుకుంటారు. ఆ మర్నాడు బయల్దేరడానికి సిద్ధమవుతున్న వేళ.. అవధ్ బిర్యానీ అష్టదిగ్బంధనం చేస్తుంది. జర్నీ మళ్లీ పోస్ట్‌పోన్! ఇలా గల్లీకో రుచి.. లక్నోకు విచ్చేసే అతిథులను మచ్చిక చేసుకొని రోజులకు రోజులు కట్టిపడేస్తాయి.

లక్నో వీధుల్లో తికమకలు, గడబిడలు క్వైట్ కామన్. ఇక్కడి హిందీ పాటల రచయిత మజ్రూహ్ సుల్తాన్ పురీ సెలవిచ్చినట్టు 'బాబూజీ ధీరే చల్‌నా.. ప్యార్ సే జరా సంభాల్‌నా..' హమ్ చేస్తూ నిదానంగా గల్లీలు చుట్టేయండి. నాల్క మీది టేస్ట్ బడ్స్‌ను ప్రేరేపించే బెస్ట్ రోస్ట్ శీర్మల్ తినండి! ఈ మొఘల్ స్వీట్‌కు చౌక్ బజార్ అడ్డా! చౌక్ బజార్‌లో సల్మాన్ శీర్మల్ వాలీ కొట్టులో ఈ రొట్టెలు అదిరేట్టు ఉంటాయి. మిఠాయితో మొదలుపెట్టిన ఈ ఫుడ్ జర్నీ వేగం పుంజుకోవాలంటే కాస్త హాట్ తగలాల్సిందే! అదే చౌక్ గల్లీలో ఏదైనా హోటల్‌కు వెళ్లి 'కుల్చా నిహారీ' అని ఆర్డర్ ఇస్తే సరి.. ముందుగా సువాసనలు పలకరిస్తాయి. ఆపై పాయా టైపు మటన్ కూర పుదీనా, కొత్తిమీరతో సింగారించుకొని కుల్చాతో జంటగా వచ్చి చవులూరిస్తుంది. 'కాస్కో నా వాస్కోడిగామా' అని క్షణంలో లాగించేస్తాం. లక్నోకీ లాజవాబ్ రచయిత కైఫీ ఆజ్మీ రాసిన 'చల్తే చల్తే యూహీ కోయి మిల్ గయా థా!' (ఈ ప్రయాణంలో.. ఎవరో అలా దొరికారు) అని పాడుకుంటూ.. ఆ దొరికింది కుల్చా నిహారీ అని తీర్మానించుకుంటాం.

**ఈ రుచుల ప్రయాణంలో ఉర్దూ శాయరీల కన్నా ఘనంగా పసందు చేసే కబాబ్‌లు మరింత ప్రత్యేకం! జిహ్వా చపలుర కోసం నగరం నలుమూలలా కబాబ్స్ ఎదురుచూస్తూ ఉంటాయి. రకరకాల మసాలాలు పులుముకొని చంద్ర నిప్పులపై వేగిన కబాబ్స్‌ను వేగిరంగా తినాల్సిందే! ఆ సమయంలో మనమూ నవాబులమే! ఆ ఆనందాన్ని కొనగలిగే షరాబులెవరు? లక్నోలో ఉర్దూను ఒంట బట్టించుకున్న బాలీవుడ్ రచయిత జావెద్ అక్తర్ పాటలో చెప్పాలంటే.. కబాబ్స్ తిన్న వ్యక్తి మనసు ఆ క్షణంలో 'చలో ఛయ్యా ఛయ్యా... జిస్కీ జుబా ఉర్దూ కీ తరహ్' అని గాల్లో తేలిపోతుంది. కబాబ్స్ తిన్నాక ఉర్దూ పరిమళం అంతా మన జిహ్వాపై తాండవిస్తుందన్న మాట!**

నిహారీని ఆహారంగా తీసుకున్న తర్వాత మంటలు కక్కే జిహ్వాకు కాస్త వెన్నముద్ద పట్టిస్తే.. అది తర్వాతి రుచులు స్వీకరించడానికి సిద్ధపడుతుంది. చౌక్, హజ్రత్ గంజ్, లాల్‌బాగ్ ఏరియాల్లో మలాయ్ మక్ఖన్ దండిగా అమ్ముతుంటారు. మీగడ వెన్నను బాదాం తురుముతో దిద్ది, కాజు పొడిని అద్ది, పిస్తాపప్పు బొట్టుపెట్టి కప్పులో చేతికిస్తారు. ఒక్క ముద్ద మింగగానే ఆత్మారాముడికి కృష్ణ పరమాత్మ గుర్తుకురాక మానడు. ఎదురుగా ఉన్న వెన్ననంతా ఎత్తుకుపోవాలనిపిస్తుంది. కానీ, ఊరు కాని ఊరు అని ఊరుకుంటాం! లక్నోలో పుట్టిపెరిగిన కథక్ నృత్యరీతిలో బిర్జూ మహరాజ్ (ఆయనా ఇక్కడివాడే) రాసలీల వర్ణిస్తున్న వైనాన్ని ఊహిస్తూ.. వెన్నదొంగ ఎంత టక్కరివాడో అని లోలోపల సంబురపడిపోతాం.

ఒక పదార్థమనేంటి? ఒక ప్రదేశమనేంటి? లక్నో కాటన్‌లో పడుగు, పేక పక్కాగా కుదిరినట్టుగా.. ఈ నగరంలో అణువణువూ రుచులమయమే! అవధ్ బిర్యానీ హైదరాబాదీ బిర్యానీకి తోబుట్టువేమో అనిపిస్తుంది. బాస్కెట్ చాట్ లాగించి, కచోరీ పూరి తినేసి, షాహీ తుక్డా ఆరగించి, ఫలూదా ఖుల్ఫీతో కుస్తీ పట్టేసరికి భుక్తాయాసం మొదలు. ఈ సమయంలో లక్నో కీ షాన్ బాలీవుడ్ సంగీత దిగ్గజం నౌషాద్ సాహెబ్ స్వరాలు కూర్చిన పాట గుర్తుకురాకపోతే నరం లేని నాల్కకు కృతజ్ఞత కూడా లేదన్న అపవాదు వస్తుంది! 'జవా హై మొహబ్బత్ హసీన్ హై జమానా, లుటాయా హై దిల్‌నే ఖుషీ కా ఖజానా' (అందమైన ప్రపంచంలో.. ప్రేమలో ఓలలాడుతూ.. ఈ హృదయం ఆనంద నిధిని కొల్లగొట్టింది) అనుకుంటూ లక్నో రుచుల ఖజానాను అందిన కాడికి దోచుకొని ఈ పాకయాత్రకు ముగింపు పలికేద్దాం. ■

